ముంపు బాధితులకు న్యాయం జరిగేలా కృషి

● జాతీయ గిరిజన కమిషన్ సభ్యుడు జట్రోత్ హుస్సేన్

బాధితులతో మాట్లాడుతున్న జట్రోత్ హుస్సేన్

యాదగిరిగుట్ట/తుర్కపల్లి, ఆగస్టు 27: బస్వాపూర్ జలాశయ నిర్మాణంలో గ్రామంతో పాటు వ్యవసాయ భూమిని కోల్పోయిన తండావాసులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని జాతీయ గిరిజన కమిషన్ సభ్యుడు జట్రోత్ హుస్సేన్ హామీ ఇచ్చారు. మంగళవారం ముంపు గ్రామాలైన యాదగిరిగుట్ట మండలం లప్పానాయక్ తండా, తుర్కపల్లి మండలం చోక్లాతండాను ఆయన సందర్శించారు. గ్రామస్తులతో మాట్లాడారు. తమకు ఇవ్వాల్సిన నష్టపరిహారం సకాలంలో మంజూరు చేయకపోవడంతో భూముల ధరలు పెగిరి తిరిగి కొనుగోలు చేయలేకపోతున్నామని తండావాసులు ఆయనకు విన్నవించారు. ఇండ్ల నిర్మాణాలు సైతం పూర్తికాలేదని తెలిపారు. దాంతో స్పందించిన ఆయన వెంటనే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి తగు న్యాయం చేసేలా చూస్తామని హామీనిచ్చారు. ఆయన వెంట డీఆర్‌డీఓ నాగిరెడ్డి, ఆర్డీఓ అమరేందర్, తాసీల్దార్లు వెంకటేశ్వర్లు, దేశ్య, ఏపీఓలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

భువనగిరి కలెక్టరేట్ : నృసింహసాగర్ భూ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఎడ్ల సత్తిరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్‌కు వినతి పత్రం అందించారు. రిజర్వాయర్‌ను సందర్శించేందుకు వచ్చిన ఆయనను కలిసి భూ నిర్వాసితులకు ప్రభుత్వ పరంగా అందాల్సిన పరిహారం వచ్చేలా చర్యలు చేపట్టాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో మాజీ ఎంపీటీసీ ఉడుత శారదాఆంజనేయులు, గ్రామస్తులు ఉన్నారు.

యాదగిరిగుట్టపై వైభవంగా గోకులాష్టమి వేడుకలు

స్వస్తివాచనం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, ఆగస్టు 27: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంతోపాటు అనుబంధ పాతగుట్ట ఆలయంలో గోకులాష్టమి వేడుకలను వైష్ణవ సంప్రదాయరీతిలో వైభవంగా జరిగాయి. మంగళవారం సాయంత్రం విశ్వక్సేనపూజ, పుణ్యహవచనం, నవకలశ స్థాపనం, మూలమంత్ర, మూర్తి మంత్ర హవనం, మహాపూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. మూలవర్యులు, ఉత్సవమూర్తులకు అభిషేకం చేశారు. రాత్రి 7.30 గంటలకు ప్రధానాలయంలోని వెలుపలి ప్రాకార మండపంలోని అద్దాల మంపడం వద్ద నెలవంక, రోహిణి నక్షత్రాన్ని వేసి శ్రీకృష్ణుడి(కణ్ణన్) విగ్రహాన్ని వేంచేపు చేసి ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా చతుర్వేద పారాయణం, దివ్య ప్రబంధ పాశుర పఠనాలు, ప్రత్యేక అర్చనలు, నివేదనలు, మంగళశాసనాలు, చాత్మార, తనియ విన్నపం చేపట్టారు. విశేషమైన 12 రకాల భోగాలతో స్వామివారికి నివేదన చేపట్టారు. ఆలయ గోశాలలో గోవులకు ఆలయ అధికారులు పూజలు చేపట్టారు. అనంతరం తీర్థ ప్రసాద గోష్ఠి నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త బి. నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు, డీఈఓ దోర్బల భాస్కర్‌శర్మ, ప్రధానార్చకులు నల్లన్‌ధీఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు, వెంకటాచార్యులు, ఏఈఓలు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా నిత్యారాధనలు

లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో స్వామి, అమ్మవార్లకు నిత్యారాధనలు శాస్త్రోక్తంగా జరిగాయి. మంగళవారం తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి, తిరువారాధన జరిపి ఉదయం ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శనభాగ్యం కల్పించారు. క్షేత్రపాలకుడైన ఆంజనేయస్వామికి ఆకుపూజ నిర్వహించారు. ప్రధానాలయంతోపాటు విష్ణుపుష్కరిణి చెంతగల ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు జరిపి, వడపప్పు, బెల్లాన్ని నైవేద్యంగా సమర్పించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. శ్రీవారిని 8వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలు కలిపి ఆలయ ఖజానాకు రూ.15,95,705 ఆదాయం సమకూరిందని అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు వెల్లడించారు. స్వామివారిని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గవర్నర్ పర్యటన ఏర్పాట్ల పరిశీలన

జైన దేవాలయం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్

ఆలేరురూరల్, ఆగస్టు 27 : మండలంలోని కొలనుపాక జైన దేవాలయం, సోమేశ్వరాలయాన్ని గురువారం రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సందర్శించనున్న దృష్ట్యా కలెక్టర్ హనుమంతు కె. జండగే బుధవారం ఏర్పాట్లను పరిశీలించారు. గవర్నర్ పర్యటనకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం అఖిలపక్ష నాయకులు కలెక్టర్‌ను కలిసి గ్రామంలోని వీరశైవ ఆలయం, వీరనారాయణస్వామి ఆలయాలను కూడా గవర్నర్ సందర్శించేలా చూడాలని, గ్రామాభివృద్ధి కార్యక్రమాల గురించి గవర్నర్‌తో చర్చించేందుకు అవకాశం కల్పించాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గంగుల శ్రీనివాస్, మామిడాల అంజయ్య, బక్క రాంప్రసాద్, నర్సింహులు, మోత్కూరి ఐలయ్య పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులకు అవగాహన

తుర్కపల్లి, ఆగస్టు 27 : మండలంలోని దత్తాయిపల్లి జడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు మంగళవారం రోటరీక్లబ్ గజ్వేల్ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యక్తిత్వ వికాస నిపుణుడు తుమ్మ కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్ ప్రణాళికను ముందస్తుగా ఏర్పాటు చేసుకొని ఆదిశగా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గిద్దె కర్ణాకర్, హెచ్ఎం స్వరూపారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మారథాన్ రన్‌లో ప్రతిభ కనబర్చిన పొద్దటూరువాసులు

కిషన్‌ను అభినందిస్తున్న ఇంటలిజెన్స్ డీజీపీ శవధర్‌రెడ్డి

వలిగొండ, ఆగస్టు27: హైదారాబాలో ఇటీవల నిర్వహించిన మారథాన్ రన్‌లో మండలంలోని పొద్దటూర్ గ్రామానికి చెందిన దుబ్బ కిషన్, నాగారం గ్రామానికి చెందిన కట్ట శేఖర్ పాల్గొని ప్రతిభ కనబర్చారు. దుబ్బ కిషన్ 42 కిలో మీటర్ల దూరాన్ని 4.28 గంటల్లో పూర్తి చేశాడు. ఈయన ప్రస్తుతం హైదారాబాద్‌లో ఇంటలిజెన్స్ విభాగంలో ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్నాడు. కట్టశేఖర్ 21 కిలో మీటర్ల విభాగంలో పాల్గొని 2.40 గంటల్లో పూర్తి చేశాడు. వీరిని ఇంటలిజెన్స్ డీజీపీ శవధర్‌రెడ్డి, హైదారాబాద్ పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి అభినందించి మెడల్స్, సర్టిఫికెట్లు అందించారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి

● ఇన్‌చార్జి డీఎంహెచ్ఓ యశోద

వైద్య సిబ్బందికి సూచనలు చేస్తున్న ఇన్‌చార్జి డీఎంహెచ్ఓ

ఆలేరురూరల్, ఆగస్టు 27 : సీజనల్ వ్యాధులపై గ్రామాల్లో అవగాహన కల్పించాలని ఇన్‌చార్జి డీఎంహెచ్ఓ యశోద ఆదేశించారు. మంగళవారం మండలంలోని కొలనుపాక సబ్ సెంటర్‌ను తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఆశకార్యకర్తలు ఫివర్ సర్వే చేపట్టి అవసరమైన వారికి మందులు అందించాలని సూచించారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. ఆమె వెంట నోడల్ అధికారి పెద్దలక్ష్మి, సిబ్బంది ఉన్నారు.

రైతులందరికీ బేషరతుగా రుణమాఫీ చేయాలి

● రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలరాజుగౌడ్

కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న రైతుసంఘం నాయకులు

భువనగిరి కలెక్టరేట్, ఆగస్టు 27 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఎలాంటి షరతులు లేకుండా అర్హులైన రైతులందరికీ రూ. 2లక్షల రుణమాఫీ చేపట్టాలని రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మాటూరి బాలరాజుగౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకులో అప్పు తీసుకున్న ప్రతి రైతుకు రుణమాఫీ చేయాలని కోరారు. ప్రభుత్వం చర్యలతో అర్హత ఉండి రుణ మాఫీ కాని రైతులు ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. పహాణీ నకల్‌పై రుణాలు తీసుకున్న రైతులకు రుణమాఫీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 50 శాతం కూడా రుణమాఫీ అమలు కాలేదన్నారు. అనంతరం కలెక్టరేట్ పరిపాలనాధికారి జగన్‌మోహన్‌కు, జిల్లా వ్యవసాయాధికారి నీలిమకు వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు మంగ నర్సింహులు, బూరుగు కృష్ణారెడ్డి, పైళ్ల యాదిరెడ్డి, సహాయ కార్యదర్శులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి, కందాడి సత్తిరెడ్డి, గన్నెబోయిన విజయభాస్కర్, బబ్బురి పోశెట్టి, పొట్ట శ్రీను, రేసు రామచంద్రారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

రైతుసంఘం ఆధ్వర్యంలో..

రాష్ట్ర ప్రభుత్వం రైతుల సమస్యలు పరిష్కరించి వారిని ఆదుకోవాలని, రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట ఆలిండియా కిసాన్‌సభ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లూరు రాజయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులందరికీ కాకుండా కొంత మందికే రూ.2 లక్షల రుణమాఫీ చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం షరతులను తొలగించి అందరికీ రుణ మాఫీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పుల కొమరయ్య, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఏశాల అశోక్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎలగందుల అంజయ్య, సహాయ కార్యదర్శి జక్క దయాకర్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు

విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

● ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లావుడ్యా రాజు

మాట్లాడుతున్న లావుడ్యా రాజు

బొమ్మలరామారం, ఆగస్టు 27: రాష్ట్ర ప్రభుత్వం విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నదని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లావుడ్యా రాజు అన్నారు. ప్రభుత్వ విద్యా సంస్థలు, హాస్టళ్ల పరిరక్షణ కోసం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన సమరభేరి సైకిల్‌యాత్ర మంగళవారం మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ జిల్లాలోని గురుకులాలకు సొంత భవనాలు లేకపోవడంతో అద్దె భవనాల్లో అరకొర వసతులతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో మద్యంశాఖకు మంత్రి ఉన్నాడని, కానీ విద్యాశాఖకు మాత్రం మంత్రిని నియమించక పోవడం దారుణమన్నారు. మండల కేంద్రంలో సంక్షేమ హాస్టల్ ఏర్పాటు చేయాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి చింతల శివాజీ, జిల్లా నాయకులు చింతల శివ, వేముల నాగరాజు, ఈర్ల రాహుల్, జగన్, శ్రీనివాస్, కార్తీక్, నరేందర్, సాయి, వినయ్, చింటు పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట ఏడీఏగా శాంతి నిర్మల

బాధ్యతలు చేపట్టిన ఏడీఏ

యాదగిరిగుట్ట, ఆగస్టు 27 : యాదగిరిగుట్ట ఏడీఏగా శాంతి నిర్మల మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఏడీఏగా ఉన్న పద్మావతి ఆలేరుకు బదిలీకాగా నల్లగొండ జిల్లా మిర్యాలగూడలోని మట్టి నమూనాల పరీక్ష కేంద్రంలో ఏడీఏగా పని చేస్తున్న శాంతి నిర్మల ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆమెకు ఏఓలు, ఏఈఓలు శాలువతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

ప్రచార వాహన్ని ప్రారంభిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

భూదాన్‌పోచంపల్లి, ఆగస్టు 27 : పట్టణంలోని నల్ల పోచమ్మ ఆలయంలో ఈ నెల 28 నుంచి సెప్టెంబర్ ఒకటోతేదీ వరకు విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు, బోనాలు నిర్వహించనున్నట్లు ఆలయన పునఃనిర్మాణ కమిటీ అధ్యక్షుడు కటుకూరి పాండురంగం, ప్రధాన కార్యదర్శి బొడిగె లింగంగౌడ్ తెలిపారు. మంగళవారం ఉత్సవాల ప్రచార వాహనాన్ని ఆలయం వద్ద జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 28న గణపతి పూజ, 29న నవగ్రహ మండప పూజలు, 30న అమ్మవారి విగ్రహ ప్రతిష్ట, మహాన్నదానం, సెప్టెంబర్ 1న బోనాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కమిటీ గౌరవాధ్యక్షుడు కొయ్యడ నరసింహ, గునిగంటి మల్లేశం, ఉపాధ్యక్షుడు భోగ చంద్రశేఖర్, డబ్బికార్ సాహెశ్, రాజా రమేశ్, కోశాధికారి మాటూరి రామకృష్ణ పాల్గొన్నారు.

మంగళగౌరీ వ్రతాల్లో పాల్గొన్న మహిళలు

మార్కండేయ ఆలయంలో మంగళ గౌరీ వ్రతాలు

భూదాన్‌పోచంపల్లి, ఆగస్టు 27 : శ్రావణ మంగళవారాన్ని పురస్కరించుకొని పట్టణ కేంద్రంలోని మార్కండేయ స్వామి ఆలయంలో మంగళ గౌరీ వ్రతాలను నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కుంకుమార్చన పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సీత సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు భారత ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి అంకం యాదగిరి, సహాయ కార్యదర్శి యాదగిరి, కోశాధికారి కృష్ణ, ధర్మకర్తలు పాల్గొన్నారు.

కారు ఢీకొని ఎక్సైజ్ కానిస్టేబుల్ మృతి

యాదగిరిగుట్ట, ఆగస్టు 27: బైక్‌ను కారు ఢీకొని ఎక్సైజ్ కానిస్టేబుల్ మృతి చెందిన ఘటన మంగళవారం మండలంలోని వంగపల్లి గ్రామ శివారులో చోటు చేసుకుంది. పట్టణ సీఐ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా దేవరకొండకు చెందిన వంకుడోత్ కీమ్యనాయక్(55) ఆలేరులో ఎక్సైజ్ కానిస్టేబుల్‌గా పని చేస్తూ హైదరాబాద్‌లో నివాసముంటున్నాడు. విధి నిర్వహణలో భాగంగా బైక్‌పై భువనగిరికి వెళ్లాడు. పని ముగించుకొని తిరిగి ఆలేరుకు బయల్దేరాడు. మార్గమధ్యంలో హైదరాబాద్-వరంగల్ 163వ జాతీయ రహదారిపై వంగపల్లి శివారులో కార్తికేయ ఇండస్ట్రీ వద్ద వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. దాంతో తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడు తిలక్‌నాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఐడీ కార్డులు

ఆత్మకూరు(ఎం), ఆగస్టు 27 : మండలంలోని కొరటికల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం ఐడీ కార్డులను అందించారు. పాఠశాలకు చెందిన గత సంవత్సర పదో తరగతి విద్యార్థుల ఆర్థిక సాయంతో ఐడీ కార్డులు అందించినట్లు ప్రధానోపాధ్యాయుడు డి. వెంకన్న తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవి, వరప్రసాద్, శ్రీనివాసచారి, అనూరాధ, వెంకటేశం పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవితకు బెయిల్‌పై హర్షం

గుండాల,ఆగస్టు 27 : ఎమ్మెల్సీ కవితకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడంపై మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మూగల శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం గుండాలలో విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే ఎమ్మెల్సీ కవితను లిక్కర్ కేసులో ఇరికించిందన్నారు. ఆడబిడ్డ అని చూడకుండా ఐదు నెలలు జైళ్లో ఉంచారన్నారు. తెలంగాణ ఉద్యమంలో ప్రజలను జాగృతం చేయడంలో, బతుకమ్మ పండగను ప్రపంచానికి చాటడంలో ఆమె కృషి ఎనలేనిదన్నారు.

29న భువనగిరిలో జాబ్‌మేళా

భువనగిరికలెక్టరేట్, ఆగస్టు 27 : వివిధ ప్రైవేటు రంగాల్లో ఉద్యోగాల కల్పన కోసం ఈ నెల 29న జిల్లా ఉపాధికల్పనా కార్యాలయం ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఉపాధి కల్పనా అధికారి పి.సాహితి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముత్తూట్ మైక్రోఫిన్ కంపెనీలో 35 పోస్టుల భర్తీ కోసం జిల్లా సమీకృత కలెక్టరేట్ మొదటి అంతస్థులో రూం నంబర్ F8లో ఉదయం 11గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో రిలేషన్ ఆఫీసర్ ఉద్యోగానికి ఇంటర్ లేదా డిగ్రీ ఉత్తీర్ణులైన వారు అర్హులని, వేతనం రూ.16 వేల నుంచి రూ. 22 వేల వరకు ఉంటుందని పేర్కొన్నారు. బ్రాంచ్ రిలేషన్ మేనేజర్‌కు డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు అనుభవం కలిగి ఉండాలని, వేతనం రూ.22వేల నుంచి రూ.30 వేల వరకు ఉంటుందని తెలిపారు. భువనగిరి, జనగామా, గజ్వేల్, సిద్దిపేట, రామాయంపేట, హుజూరాబాద్, భూపాల్‌పల్లి, పరకాల బ్రాంచ్‌లలో ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తిగల వారు రెజ్యూమ్, విద్యార్హత సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు.

విద్యార్థులకు నోటుపుస్తకాలు పంపిణీ

చౌటుప్పల్‌రూరల్, ఆగస్టు 27 : మండలంలోని దేవలమ్మనాగారం, కొయ్యలగూడెం గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం దివీస్ పరిశ్రమ సహకారంతో నోటు పుస్తకాలు, స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గురువారావు, కొయ్యలగూడెం మాజీ సర్పంచ్ గంజి నర్సింహ, ఎం. కృష్ణ, కె. అశోక్, మధుసూదన్‌రెడ్డి, శివజ్యోతి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

చౌటుప్పల్‌రూరల్, ఆగస్టు 27 : మండలంలోని జైకేసారం గ్రామ పరిధిలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వలిగొండ మండలం కేర్పుపల్లి గ్రామానికి చెందిన కళ్లెం శ్రీధర్‌రెడ్డి(42) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కేర్పుపల్లికి చెందిన శ్రీధర్‌రెడ్డి హైదరాబాద్‌లో నివాసముంటున్నాడు. మంగళవారం స్వగ్రామానికి బైక్‌పై వెళ్తుండగా చౌటుప్పల్ మండలం జైకేసారం గ్రామం వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడ్డ శ్రీధర్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలి

● జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి

సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణవేణి

ఆలేరురూరల్, ఆగస్టు 27 : అంగన్‌వాడీ కేంద్రాకు వచ్చే చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి అన్నారు. మంగళవారం ఆలేరు ఐసీడీఎస్ కార్యాలయంలో అంగన్‌వాడీ సహాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలకు పాడైన గుడ్లు వస్తే తీసుకోవద్దన్నారు. గర్భిణులకు ఇచ్చే పౌష్టికాహారం నాణ్యతను పరిశీలించిన తర్వాతే వారికి పంపిణీ చేయాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులు భోజనం చేసేలా చూడాలన్నారు. కేంద్రాలను, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. సమావేశంలో సీడీపీఓ స్వరాజ్యం, సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

ఏడీఏ వెంకటేశ్వర్‌రావుకు సన్మానం

ఏడీఏను సన్మానిస్తున్న ఏఓలు

ఆలేరురూరల్, ఆగస్టు 27 : ఆలేరు ఏడీఏగా పని చేసి భువనగిరికి బదిలీపై వెళ్లిన వెంకటేశ్వర్‌రావును మంగళవారం ఏడీఏ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి గోపాల్ పాల్గొని మాట్లాడారు. రైతులకు వెంకటేశ్వరావు చేసిన సేవలను ప్రశంసించారు. కార్యక్రమంలో మండలాల వ్యవసాయశాఖ అధికారులు, ఏఈఓలు, వివిధ శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 15న చేనేత కార్మిక సంఘం ఎన్నికలు

భూదాన్‌పోచంపల్లి, ఆగస్టు 27: పట్టణ కేంద్రంలోని చేనేత కార్మిక సంఘం ఎన్నికలు సెప్టెంబర్ 15న నిర్వహించనున్నట్లు పద్మశాలీ మహాజన సంఘం అధ్యక్షుడు సీత శ్రీరాములు, ఉపాధ్యక్షుడు అంక మురళి తెలిపారు. మంగళవారం స్థానిక సంఘం భవనంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. న్నికల నిర్వహణలో భాగంగా వచ్చేనెల 5న నామినేషన్ల స్వీకరణ, అదేరోజు మధ్యాహ్నం మూడు గంటల తర్వాత పరిశీలన, 6న నామినేషన్ల ఉపసంహరణ, అదే రోజు మధ్యాహ్నం మూడు గంటల తర్వాత అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు చేపడతామన్నారు. 15న ఎన్నికల పోలింగ్, 16న ఓట్ల లెక్కింపు ఉంటుందని తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేసేవారు అధ్యక్ష స్థానానికి రూ.2,500, డైరెక్టర్ స్థానానికి రూ.1000 చొప్పున చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. సమావేశంలో సంఘం నాయకులు చిట్టిపోలు శ్రీనివాస్, భారత లవ కుమార్, భోగ నరసింహ, భారత బాలరత్నం, సంగెం చంద్రయ్య, గుండు పాండు, మెరుగు శశికళ, కర్నాటి అంజమ్మ, సురపల్లి రవి, రాపోలు శ్రీనివాస్, ఏలే భిక్షపతి, చింతకింది రమేశ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యురాలికి పూర్వ విద్యార్థుల సన్మానం

వైద్యురాలికి జ్ఞాపికను అందిస్తున్న స్నేహితులు

చౌటుప్పల్, ఆగస్టు 27 : చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ దవాఖాన వైద్యురాలు విజయలక్ష్మిని మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాకు చెందిన 1992-93బ్యాచ్ పదో తనగతి పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఆమె సొంత గ్రామానికి వైద్యురాలుగా రావడంపట్ల వారు హర్షం వ్యక్తం చేస్తూ శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గోపగోని లక్ష్మణ్, వరగంటి రాజేందర్, చింతల బాలకృష్ణారెడ్డి, గజం ఆనంద్, బొంగు పాండుగౌడ్, మాధవాచారి, సత్యనారాయణ పాల్గొన్నారు.

విజ్ఞానాన్ని పెంచేందుకు గ్రంథాలయాలు దోహదం

● ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

మాట్లాడుతున్న ప్రెస్‌అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

సంస్థాన్ నారాయణపురం, ఆగస్టు 27: విజ్ఞానాన్ని పెంపొదించుకోవడానికి గ్రంథాలయలు దోహదపడతాయని ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని జనగాం గ్రామంలో జేడీ ఫౌండేషన్ సహకరంతో ఏర్పాటు చేసిన గ్రంథాలయన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కేవలం డాక్టర్, ఇంజినీరింగ్ కోర్సులే కాకుండ ఇతర కోర్సుల వైపు కూడా దృష్టి సారించాలని సూచించారు. అంతకు ముందు మండల కేంద్రంలోని సీపీఐ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ వచ్చే నెల చివరి వరకు జర్నలిస్టుల ఇండ్ల స్థలాలు, హెల్త్ కార్డులపై స్పష్టత వచ్చే అవకాశ ఉందన్నారు. రాష్ట్రంలో 25 వేల మంది జర్నలిస్టులు ఉన్నారని, వారి సమస్యలు పర